
'ఇంతి'ంతై.. ఎదిగేలా...
మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగేలా ఇస్తున్న బ్యాంకు లింకేజీ రుణాలతో వ్యాపారాలు ఏర్పాటుచేస్తున్నారు. 8లో


సర్వే సమస్యకు చెక్ పెట్టేలా...
సర్వేయర్ల కొరత తీర్చేందుకు గాను నిరుద్యోగులను లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనున్నారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
35° / 25°
వాతావరణం
జిల్లాలో బుధవారం కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది. పలుచోట్ల ఈదురుగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

అత్యవసర సర్వీసులపై అవగాహన


పరికరాల పనితీరును వివరిస్తున్న మేనేజర్

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం సీహెచ్‌సీకి ఇటీవల 108, 102 నియోనేటల్ అంబులెన్స్ సేవలు మంజూరయ్యాయి. ఆయా వాహనాల్లో ఉన్న అత్యాధునిక పరికరాల వినియోగంపై అత్యవసర సేవల జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శివకుమార్ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. సీహెచ్‌సీకి మంగళవారం వచ్చిన ఆయన అంబులెన్స్‌ల్లోని సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృపా ఉషశ్రీ ఉద్యోగులు దుర్గాప్రసాద్, శ్రీనివాస్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు చికిత్స దైవసేవతో సమానం


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

ఖమ్మంవైద్యవిభాగం: వయోవృద్ధులకు చికిత్స అందించడాన్ని దైవానికే సేవ చేసినట్లుగా భావించాలని డీఎంహెచ్ఓ బి.కళావతిబాయి తెలిపారు. జిల్లా ప్రధాన ఆస్పత్రిలోని వయోవృద్ధుల కేర్ సెంటర్(పాలియేటివ్ కేర్ సెంటర్), కేన్సర్ వార్డులను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల కేంద్రంలో ఉన్న వారి వివరాలు తెలుసుకున్నాక వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. జీవిత చరమాంకంలో ఉన్న వయోవృద్ధుల కోసం ఏర్పాటుచేసిన పాలియేటివ్ కేర్ సెంటర్‌తో మెరుగైన సేవలందించాలని సూచించారు. ఆతర్వాత డాక్టర్ ప్రేమలత, ఉద్యోగులతో మాట్లాడిన డీఎంహెచ్ఓ రికార్డులు పరిశీలించారు. అనంతరం తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్‌లో పరీక్షల వివరాలు ఆరా తీశారు.


8,976 మందికి రూ.39.95కోట్ల బోనస్

1,60,853.040 మె.టన్నుల ధాన్యం కొనుగోళ్లు


కొనుగోలు కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీసీఎస్ఓ చందన్‌కుమార్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఈ ఏడాది(2024–25) రబీ సీజన్‌లో ఇప్పటి వరకు రైతుల నుంచి 1,60,853.040 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలో 21,505 రైతుల నుంచి ఈ ధాన్యం సేకరించారు. ఇందులో రూ.371.70కోట్లకు గాను రూ.309.82 కోట్ల బిల్లులు రైతుల ఖాతాల్లో జమ చేశారు. గతేడాది రబీ సీజన్‌లో 21,884.360 మె.టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా... ఈ ఏడాది ఇప్పటి వరకు 1,60,853.040 మె.టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయిందని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ వెల్లడించారు. అలాగే, సన్నధాన్యానికి ప్రభుత్వం ప్రకటించినట్లుగా క్వింటాకు రూ.500 చొప్పున 8,976మంది రైతులకు రూ.39.95కోట్ల బోనస్ జమ అయిందని తెలిపారు. మొత్తంగా సన్నధాన్యం 84,601.240 మె. టన్నులు సేకరించగా, 69,893.520 మె.టన్నుల ధాన్యానికి బోనస్ అందని వెల్లడించారు. ఇక కామన్ గ్రేడ్ ధాన్యం 71,706.040 మె. టన్నులు కొనుగోలు చేశామని డీసీఎస్ఓ వివరించారు. కాగా, జిల్లాలోని పలు ధాన్యం కొనుగోలు, మిల్లులను ఆయన మంగళవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.

మూడు నెలల బియ్యం ఒకేసారి



మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం వచ్చే నెలలో ఒకేసారి లబ్ధిదారులకు ఇవ్వనున్నట్లు డీసీఎస్ఓ చందన్‌కుమార్ తెలిపారు. జిల్లాలో 748 రేషన్ షాప్‌లు, 4,11,202 కార్డులు ఉండగా, 11,30,169మంది లబ్ధిదారులు ఉన్నారని పేర్కొన్నారు. వీరికి ప్రతీనెల 7,618.457 మె.టన్నుల బియ్యం అవసరం ఉండగా, సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీసీఎస్ఓ తెలిపారు.

పత్తి సాగుకు సై !


జీరోలులో ప్లౌ దుక్కులు వేస్తున్న రైతు

ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు ప్రణాళిక

జిల్లా	సాగు (ఎకరాల్లో)	విత్తనాలు (ప్యాకెట్లు)	అందుబాటులో ఉన్నవి
ఖమ్మం	2.13లక్షలు	4.82 లక్షలు	37వేలు
భద్రాద్రి	2.14లక్షలు	4.84 లక్షలు	1.83లక్షలు

దుక్కులు సిద్ధం చేస్తున్న రైతులు

- ఉమ్మడి జిల్లాలో 4.27 లక్షల ఎకరాల్లో సాగు అంచనా
- 9 లక్షలకు పైగా విత్తన ప్యాకెట్ల అవసరం
- త్వరలోనే డీలర్లతో భేటీ, విక్రయాలకు అనుమతి


ఖమ్మంలోని ఓ ఫర్టిలైజర్ షాప్ వద్ద పత్తి విత్తన కంపెనీల బోర్డులు

ఖమ్మంవ్యవసాయం: పత్తి సాగుకు సమయం సమీపిస్తోంది. కొద్దిరోజులుగా అడపాదడపా కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు దుక్కులు దున్నే పనిలో నిమగ్నమయ్యారు. ఈ నెల 27వ తేదీ నాటికి దేశంలోకి ఆ తర్వాత, కొద్ది రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయని వాతావరణ విభాగం అధికారులు చెబుతున్నారు. తొలకరి వర్షాలు కురవగానే రైతులు పత్తి సాగుపై దృష్టి సారించనుండడంతో అవసరమైన ఏర్పాట్లకు వ్యవసాయ శాఖ సన్నాహాలు చేస్తోంది.

త్వరలోనే డీలర్లతో సమావేశం

పత్తి సీజన్ సమీపిస్తున్న వేళ విత్తన విక్రయాలపై డీలర్లతో సమావేశం నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారులు నిర్ణయించారు. నాణ్యమైన విత్తనాల విక్రయం, ఇందులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రిజిస్టర్ల నిర్వహణ, ధరలు, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడంపై దిశానిర్దేశం చేయనున్నారు. సమావేశంలో విత్తన విక్రయాలకు ఇచ్చే అనుమతులపైనా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

టాస్క్‌ఫోర్స్ బృందాల ఏర్పాటు

నకిలీ పత్తి విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా అరికట్టేలా మండలాలు, డివిజన్ల వారీగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయనున్నారు. మండల, డివిజన్, జిల్లాస్థాయిలో ఏర్పాటుచేసే ఈ బృందాల్లో వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులను సభ్యులుగా నియమిస్తారు. జిల్లాస్థాయి బృందాల్లో ఏడీఏ, డీఎస్పీ లేదా సీఐ, అగ్రికల్చర్ యూనివర్సిటీ అధికారి, డివిజన్‌స్థాయి కమిటీలో ఏడీఏ, ఎంఈఓ, మండలస్థాయి కమిటీలో ఏఓ, ఎస్‌ఐలు, రెవెన్యూ సిబ్బంది ఉంటారు. అనుమతి లేకుండా గ్రామాల్లో విత్తనాలు అమ్మే దళారులు.. అక్రమాలకు పాల్పడే డీలర్లపై నిఘా వేసి రైతులు మోసపోకుండా చర్యలు తీసుకుంటారు.

త్వరలోనే భేటీ, అనుమతులు



పత్తి సాగు చేసే రైతులకు అవసరమైన విత్తనాలు సమకూర్చనున్నాం. లైసెన్స్‌డ్ డీలర్ల వద్ద అందుబాటులోకి తీసుకొస్తాం. అయితే, ఇంకా విత్తన విక్రయాలకు అనుమతులు ఇవ్వలేదు. త్వరలోనే డీలర్లతో సమావేశం నిర్వహించి విక్రయాలకు చర్యలు తీసుకుంటాం. అలాగే, నకిలీ విత్తన విక్రయాలను సమర్థవంతంగా నిలువరించేలా టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేస్తాం.
–ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

పెరిగిన విత్తన ధరలు

ఈ ఏడాది ఖమ్మం జిల్లాలోని 2.13 లక్షల ఎకరాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2.14 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయ శాఖ ప్రణాళికలో పేర్కొంది. ఎకరాకు 450 గ్రాములవి రెండు విత్తన ప్యాకెట్లను వినియోగిస్తారు. ఉమ్మడి జిల్లా రైతులకు అవసరమైనవే కాక అదనంగా కలిపి 10.10 లక్షల మేర ప్యాకెట్లను సమకూర్చాలని భావిస్తున్నారు. ఇప్పటికే వివిధ విత్తన కంపెనీల నుంచి ఖమ్మం జిల్లా డీలర్లు 36,279 ప్యాకెట్లు, భద్రాద్రి జిల్లా డీలర్లు 1.83 లక్షల ప్యాకెట్ల విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక్కడి నేలలకు అనుకూలమైన నూజివీడు, తులసి, యూఎస్, రాశి, ఆశ, డాక్టర్ బెంట్, నీరజ, అంకూర్, కావేరి తదితర కంపెనీ విత్తనాలను అమ్మేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కాగా, గత ఏడాది 450 గ్రాముల విత్తన ప్యాకెట్ ధర రూ.864 ఉండగా, ఈ ఏడాది రూ.37 పెంచి రూ.901గా నిర్ణయించారు.



నిర్మాణరంగంలో కుదుపులు


ఖమ్మంలోని అడ్డాలో పని కోసం వేచి ఉన్న కూలీలు

- భారీగా పెరిగిన ఇనుము, సిమెంట్ ధరలు
- పేద, మధ్య తరగతికి దూరమవుతున్న సొంతింటి కల
- 'ఇందిరమ్మ' లబ్ధిదారులకూ అవే ఇక్కట్లు
- మరోపక్క ఉపాధి కోల్పోతున్న నిర్మాణరంగ కార్మికులు


మధిర సుందరయ్యనగర్‌లో ఇంటి నిర్మాణం

మధిర: భారీగా పెరిగిన ఇనుము, సిమెంట్, ఇసుక ధరలతో భవన నిర్మాణ రంగం కుదేలవుతోంది. సొంతింటి కల నెరవేర్చుకోవాలని పేద, మధ్య తరగతి ప్రజలు రూపాయి, రూపాయి కూడబెట్టేలోగా ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో వారి కల నెరవేరే పరిస్థితి కానరావడం లేదు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వస్తాయని ఆశించినా నిరాశే ఎదురైంది. ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నప్పటికీ వివిధ దశల్లో బిల్లులు మంజూరు చేయనుండడంతో ఆ పెట్టుబడి ఎలా సమకూర్చుకోవాలో తెలియక పేదలు సతమతమవుతున్నారు. ఫలితంగా నిర్మాణ రంగం నత్తనడకన సాగుతుండడంతో వేలాది మంది కార్మికులు ఉపాధి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

సీజన్‌లోనే పైపైకి...

సాధారణంగా సన్న, చిన్నకారు రైతులు, పేద ప్రజలు వ్యవసాయ పనులు పూర్తయ్యాక వేసవికాలంలో ఇళ్ల నిర్మాణం మొదలుపెడతారు. కానీ జనవరి నుంచి మార్చి వరకు తగ్గుతూ వచ్చిన సిమెంట్ ధర ఏప్రిల్‌కల్లా అమాంతం పెరిగింది. ఒక్కో సిమెంట్ బస్తా ధర కంపెనీల వారీగా రూ.350 నుంచి రూ.370.. కొన్నిసార్లు అంతకు మించి పలుకుతోంది. అలాగే, ఇనుము కూడా గత మూడు నెలలుగా తగ్గుతూ వచ్చి ఏప్రిల్ మొదటి వారంలో భారీగా పెరిగింది. ఇక ట్రాక్టర్ ట్రక్కు ఇసుక ధర రూ.5 వేలకు పైగానే పలుకుతోంది. ఈనేపథ్యాన ఎక్కువ మంది ఇళ్ల నిర్మాణానికి వెనుకడుగు వేస్తుండగా, ఇంకొందరు మధ్యలోనే వదిలేస్తున్నారు. ఈ ప్రభావం మేస్త్రీలు, కూలీలతో పాటు రాడ్ బెండింగ్, విద్యుత్, మార్బుల్, ప్లంబర్, పెయింటర్లు, కార్పెంటర్లు.. ఇలా అన్ని రంగాల కార్మికులపై పడుతోంది. ఇప్పటికే పెరిగిన సుతారీ మేస్త్రీలు, కూలీల రేట్లు, ఇసుక ధరలతో పలువురు అపార్ట్‌మెంట్లు, ఇళ్ల నిర్మాణంపై ఆసక్తి చూపడం లేదు. గత ఏడాది చదరపు అడుగు నిర్మాణానికి రూ.3వేల వ్యయం కాగా, ఇప్పుడు అది రూ.3,500కు చేరడంతో అపార్ట్‌మెంట్లలో ప్లాట్ల అమ్మకం కూడా ముందుకు సాగడం లేదని బిల్డర్లు చెబుతున్నారు.

ధరల్లో పెరుగుదల ఇలా..

నెల	సిమెంట్ ధర ఒక్కో బస్తా (రూ.ల్లో)	ఇనుము టన్ను (రూ.ల్లో)
జనవరి	290	58,000
ఫిబ్రవరి	280	57,000
మార్చి	260	56,000
ఏప్రిల్	350	69,000
మే	370	69,000

పని లేక ఇక్కట్లు

పెరిగిన ఇనుము, సిమెంట్ ధరలతో నిర్మాణరంగం నత్తనడకన సాగుతోంది. దీంతో ఈ రంగంపై ఆధారపడిన వ్యాపారాలు సైతం పడిపోయాయి. ఒక్కో అద్దె చెల్లింపు, హమాలీలకు సరిపడా వ్యాపారం కూడా సాగడం లేదని చెబుతున్నారు. అలాగే, కార్మికులకు ప్రతిరోజు పనులు దొరకక పస్తులు ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఖాళీగా ఉంటున్నాం



ప్రతీరోజు మధిరకు వస్తాం. ఇక్కడి నుంచి అవసరమైన మేస్త్రీలు మమ్మల్ని పనికి తీసుకెళ్తారు. నాతో పాటు పలు గ్రామాల నుంచి వందలాది మంది వస్తుంటారు. అయితే, ఒక్కోరోజు పని దొరకడం లేదు. అన్ని ధరలు పెరగడంతో చాలా మంది ఇళ్లు కట్టక ఇలా జరుగుతోందని చెబుతున్నారు.
– ఎస్ రామారావు, సుతారి కూలీ, మధిర

నిర్మాణాలు తగ్గిపోయాయి



ఇనుము, సిమెంట్ ధరలు పెరగడంతో నిర్మాణాలు నిలిచిపోతున్నాయి. గతంలో చేతినిండా పని ఉండేది. తాపీ మేస్త్రీల కింద పని చేసేందుకు ఎందరు కూలీలు వచ్చినా సరిపోయేది కాదు. కానీ ఇప్పుడు అందరికీ పని కల్పించలేక తరచుగా కొందరు కూలీలను వెనక్కి పంపాల్సి వస్తోంది.
– కత్తి జానయ్య, పెద్ద తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షులు, మధిర

నిర్మాణరంగంపై ప్రభావం



ఇనుము, సిమెంట్ ధరలు పెరగడం నిర్మాణరంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మూడు నెలల పాటు తగ్గుతూ వచ్చిన ఇనుము, సిమెంట్ ధరలు ఏప్రిల్ నుంచి పెరిగిపోయాయి. జిల్లాలో లక్షలాది మంది వ్యాపారులు, కార్మికులపై ఈ ప్రభావం పడింది. ధరలు తగ్గించేలా ప్రభుత్వాలు కృషి చేయాలి.
– తూములూరి ఉపేందర్, ఐరన్, సిమెంట్ వ్యాపారి, మధిర

ఎయిడ్స్ నియంత్రణకు పటిష్ట కార్యాచరణ

- సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మంవైద్యవిభాగం: హెచ్‌ఐవీ ఎయిడ్స్‌ను రూపుమాపేలా తీసుకోవాల్సిన చర్యలపై పటిష్ట కార్యాచరణ అమలుచేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాప్తి, తద్వారా నష్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. హైరిస్క్ ఉన్న వర్గాల్లో పెళ్లికి ముందు పరీక్షలు చేసుకునేలా పర్యవేక్షించాలని చెప్పారు. ఆసక్తి ఉన్న వారితో వీడియోలు రూపొందించి గ్రామాల వాట్సప్ గ్రూపుల్లో ప్రచారం చేయాలని తెలిపారు. అలాగే, హెల్ప్‌లైన్ 1097 నంబర్‌పై విస్తృత ప్రాచుర్యం కల్పించాలని సూచించారు. అంతేకాక బాధితులు తప్పనిసరి చికిత్స తీసుకునేలా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ బి.కళావతిబాయి, అడిషనల్ డీఎంహెచ్ఓ పి.వెంకటరమణ, ఏఆర్‌టీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ పి.మోహన్‌రావు, డేటా మేనేజర్ పి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు విత్తనాల విక్రయం

ఖమ్మంవ్యవసాయం: వానాకాలం పంటల సీజన్ సమీపిస్తున్నందున డీలర్లు విత్తన విక్రయాల్లో నిబంధనలు తప్పక పాటించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో విత్తన విక్రయాలు, ఈ–పాస్ యంత్రాల వినియోగంపై నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ ఆధ్వర్యాన వ్యవసాయాధికారులు, డీలర్లకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రాంతాల వారీగా డిమాండ్ మేరకు విత్తనాలు అందుబాటులోకి తీసుకురావాలని, రైతులకు పూర్తి వివరాలతో రశీదు ఇవ్వడమే కాక నిల్వలపై రికార్డుల్లో నమోదు చేయాలని తెలిపారు. లైసెన్సు లేకుండా విక్రయించినా, రికార్డులు సరిగ్గా లేకపోయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత సీజన్‌లో జిల్లాలో 100 మంది రైతులు నకిలీ విత్తనాల కారణంగా నష్టపోయినందున ఆ పరిస్థితి పునరావృతం కాకుండా అధికారులు తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమాభివృద్ధి అధికారి ఎం.వీ..మధుసూదన్, అధికారులు వాసవీరాణి, కొంగర వెంకటేశ్వరరావు, విజయచంద్ర, సరిత తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎరువుల విక్రయాల్లో వినియోగానికి ఎన్ఎఫ్ఎల్ కంపెనీ సమకూర్చిన ఈ–పాస్(ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్) మిషన్లను కలెక్టర్ డీలర్లకు అందించారు. ఒక్కో యంత్రం విలువ రూ.20 వేల వరకు ఉండగా, జిల్లాలోని 700 మంది రిటైల్ డీలర్లకు అందించనున్నారు.

పాఠశాలల అభివృద్ధికి నిధులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రప్రభుత్వం పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించేలా నిధులు కేటాయిస్తోంది. ప్రస్తుతం కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలపై ప్రత్యేక దృష్టి సారించగా... కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఖమ్మం కార్పొరేషన్, సుడా పరిధి లోని పాఠశాలల్లోనూ పనులు చేయించాలని నిర్ణయించారు.

14 కేజీబీవీలకు రూ.5కోట్లు

జిల్లాలో 14 కేజీబీవీలు ఉండగా.. వీటిలో కనీస వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.5కోట్ల నిధులు కేటాయించింది. ఈ నిధులతో చిన్నచిన్న మరమ్మతులు చేయించడమే కాక పాఠశాలల్లో కనీస అవసరాలు సమకూరేలా పనులు చేపడుతారు. విద్యుత్ వైరింగ్, తరగతి, వసతిగదుల మరమ్మతులే కాక ఇంకుడు గుంతలు నిర్మాణానికి నిధులు వెచ్చించనున్నారు. ఇక కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, సుడా పరిధి పాఠశాలల్లో పనులపై దృష్టి సారించారు. మొదటి విడత సుడా పరిధి పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. నివేదికలు అందగానే పనులు మొదలుపెట్టి పాఠశాలల పునఃప్రారంభం నాటికి పూర్తిచేయించాలనే లక్ష్యంతో ఉన్నారు. ఈమేరకు 64ప్రాథమిక పాఠశాలల్లో ప్రహరీలు, గదులు నిర్మించనున్నారు.

ట్యాంక్‌బండ్ల నిర్మాణానికి రూ.30.60 కోట్లు


మధిర నియోజకవర్గంలో ఆరు చెరువులకు నిధులు

మధిర: మధిర నియోజకవర్గంలోని ఆరు చెరువులను ట్యాంక్‌బండ్లుగా అభివృద్ధి చేసేందుకు రూ.30.60 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. చింతకాని చెరువుకు రూ.7.90 కోట్లు, మాటూరుకు, రూ.90లక్షలు, చిరుమర్రి చెరువుకు రూ.2.90 కోట్లు, ముత్తారం చెరువు అభివృద్ధికి రూ.8.95 కోట్లు, కలకోటకు రూ.7.05కోట్లు, బయ్యారం చెరువుకు రూ.2.90 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చెరువుల అభివృద్ధితో నీటి నిల్వ సామర్థ్యం పెరగడమే కాక స్థానికులకు ఆహ్లాదం అందుతుందని, నిధులు మంజూరు చేయించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

జల రవాణాపై దృష్టి!

గోదావరి నదిలో జల రవాణాకు గల అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇటీవల ప్రకటించారు. ఇది కార్యరూపం దాల్చితే జిల్లాలో ఉపాధి, వాణిజ్య రంగాలు మెరుగుపడే అవకాశం ఉంది.
– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

- జలమార్గంపై అధ్యయనం చేస్తామని డిప్యూటీ సీఎం ప్రకటన
- గతంలో గోదావరిలో రాజమండ్రి- భద్రాచలం- సిరోంచల మధ్య రవాణా
- కేంద్ర ప్రభుత్వ పరిశీలనలోనూ రాజమండ్రి–భద్రాచలం స్ట్రెచ్


దుమ్ముగూడెం మండలంలో కాటన్ ఆనకట్ట వద్ద జల రవాణా కోసం గతంలో ఉపయోగించిన మార్గం (ఫైల్)

గతంలో రాజమండ్రి, భద్రాచలం మీదుగా..

కాకినాడ పోర్టు నుంచి బొగ్గును రైలు మార్గంలో తెలంగాణకు తీసుకొస్తుండగా తెలంగాణ బియ్యాన్ని రోడ్డు మార్గంలో భద్రాద్రి జిల్లా మీదుగానే కాకినాడకు తరలిస్తున్నారు. గోదావరిలో జలరవాణా అందుబాటులోకి వస్తే కాకినాడ పోర్టు నుంచి రాజమండ్రి మీదుగా తెలంగాణలోని భద్రాచలం వరకు సరుకు రవాణాకు అవకాశం ఉంది. గతంలో కాకినాడ – రాజమండ్రి – భద్రాచలం – చర్ల – కాళేశ్వరం (సిరోంచ, మహారాష్ట్ర)ల మధ్య బ్రిటీష్ / నిజాం జమానాలో జల రవాణా నిర్విరామంగా జరిగింది. స్వాతంత్రం వచ్చిన తర్వాత రోడ్డు మార్గాలు విరివిగా అందుబాటులోకి రావడంతో క్రమంగా జలరవాణా కనుమరుగైంది.

బరాజ్‌ల అండతో

గోదావరిలో ఏడాది పొడవునా ఏపీలోని వీఆర్‌పురం మండలం పోచవరం నుంచి రాజమండ్రి వరకు పడవలు తిరిగేంత నీటి మట్టం ఉంటుంది. ఈ స్ట్రెచ్‌లో పర్యాటకప్రాంతమైన పాపికొండలకు బోట్లు నిత్యం నడుస్తూనే ఉంటాయి. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే, రాజమండ్రి–భద్రాచలం–దుమ్ముగూడెం ఆనకట్ట వరకు జల రవాణాకు అనుకూలమైన నీటిమట్టం ఉండే అవకాశముంది. ఆ పైన సీతమ్మ సాగర్ (నిర్మాణంలో ఉంది), సమ్మక్క సాగర్ బరాజ్‌లతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా లక్ష్మి, పార్వతి, సరస్వతి బరాజ్‌లు ఉన్నాయి. వీటికిపైన మంచిర్యాల–గోదావరిఖని వంటి పారిశ్రామిక ప్రాంతాల నడుమ శ్రీపాదసాగర్ బరాజ్ ఉంది. దీంతో జలరవాణాకు కావాల్సినంత నీటి మట్టం గోదావరిలో అందుబాటులో ఉంటుందని అంచనా వేస్తున్నారు.

వాటర్ వేస్

జలరవాణా అభివృద్ధిపై కేంద్రం నుంచి గతంలో అనేక ప్రకటనలు వచ్చాయి. 2008లో యూపీఏ హయాంలో నేషనల్ వాటర్ వేస్ పేరుతో ఓ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో వాటర్ వేస్–4లో భద్రాచలం నుంచి రాజమండ్రి వరకు 171కి.మీ జల రవాణా మార్గాన్ని ప్రతిపాదించారు. ఆ తర్వాత ఎన్డీఏ ప్రభుత్వం రోడ్, రైల్, రివర్(ఆర్ఆర్ఆర్) ట్రాన్స్‌పోర్ట్ పేరుతో ఇదే పథకానికి కొత్తరూపు ఇచ్చింది. ఇందులో మహారాష్ట్రలో నాసిక్ నుంచి బంగాళాఖాతం వరకు గోదావరిలో జలరవాణాకు గల అవకాశాలు పరిశీలించాలని నిర్ణయించింది. ఈ మేర కు వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీస్ సర్వీసెస్ (వాప్కోస్) ఆధ్వర్యంలో పలుమార్లు సర్వేలు కూడా జరిగాయి.

ప్రతికూలతలు

కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బరాజ్‌ల భవిష్యత్ ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. సీతమ్మసాగర్ బరాజ్‌కు ఇంకా అనుమతులు రాలేదు. వీటిపై స్పష్టత వచ్చాకే జల రవాణాపై అడుగులు ముందుకు పడే అవకాశం ఉంది. లేదంటే యూపీఏ, ఎన్డీఏ సర్కార్ల తరహాలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రకటనలు, సర్వేలతో సరిపెట్టే అవకాశముంది. ఒక వేళ ఎగువ ప్రాంతాలను మినహాయించి కాకినాడ – రాజమండ్రి – భద్రాచలం వరకే జలరవాణాకు గల అవకాశాలను పరిగణనలోకి తీసుకుంటే కొంతమేరకు అడుగులు ముందుకు పడే అవకాశముంది. అయినా భద్రాచలంలో స్థల లభ్యతతోపాటు భద్రాచలం – మల్కన్‌గిరి రైల్వేలైనులో పాండురంగాపురం – సారపాక సెక్షన్ల మధ్య రైలు మార్గాన్ని త్వరితగతిన నిర్మించాల్సి ఉంటుంది. గోదావరిలో జలరవాణా మొదలైతే తెలంగాణకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మరింత కీలకంగా మారే అవకాశముంది. స్థానికులకు వ్యాపార, ఉపాధి రంగాల్లో అవకాశాలు మరింతగా మెరుగవుతాయి.

చవక రవాణా

రోడ్డు, రైలు మార్గాలతో పోల్చితే జలరవాణా చవక. అందువల్లే సముద్ర తీరం ఉన్న రాష్ట్రాలు వ్యాపార, వాణిజ్య రంగాల్లో దూసుకుపోతుంటాయి. తెలంగాణకు సముద్ర తీరం లేకపోవడం లోటుగా ఉంది. దీంతో రాష్ట్ర విభజన తర్వాత డ్రైపోర్టులు అభివృద్ధి చేయాలని నిర్ణయించినా.. ఆశించిన పురోగతి రాలేదు. దీంతో జలరవాణాకు గల అవకాశాలను పరిశీలించే పనిలో ప్రభుత్వం ఉంది. ఇతర దేశాల నుంచి చౌకగా లభించే బొగ్గును కాకినాడ నుంచి తెలంగాణలో ఉన్న విద్యుత్ సంస్థలకు సరఫరా చేయడం, తెలంగాణలో పండిన వరి ధాన్యాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేయడానికి జలరవాణా ఉపయోగపడుతుందని అంచనా వేశారు. కృష్ణా నదిలో జలరవాణా అందుబాటులోకి వస్తే దాని తీర ప్రాంతంలో ఉన్న సిమెంట్ పరిశ్రమలకు మేలు జరుగుతుందనే అంచనాలున్నాయి.

క్లుప్తంగా

ఉత్పత్తుల విక్రయానికి వేదికగా మహిళా మార్ట్



ఉత్పత్తులను పరిశీలిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: మహిళా స్వయం సంఘాల్లోని సభ్యులు రూపొందించిన వస్తువులను అమ్ముకునేలా మహిళా మార్ట్ వేదిక కానుందని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. పలువురు సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను మంగళవారం కేఎంసీ కార్యాలయంలో మెప్మా అధికారుల సమక్షాన ప్రదర్శించారు. ఆయా సామగ్రిని పరిశీలించిన మేయర్ మాట్లాడుతున్న నాణ్యమైన ఉత్పత్తులను తయారుచేస్తున్న మహిళలకు మార్ట్ ప్రారంభంతో మెరుగైన ధర లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ ఎస్.సుజాత, టీఎంసీ జి.సుజాత, సీఓలు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని 33రేషన్ షాపుల్లో పౌరసరఫరాల శాఖ అధికారులు మంగళవారం మూడు బృందాలుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రేషన్ దుకాణాల్లో పంపిణీ చేస్తున్న సన్న బియ్యంతో పాటు గతంలో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం నిల్వలకు సంబంధించి రికార్డులు పరిశీలించారు. ఈ మేరకు నివేదికలను జిల్లా అధికారులకు పంపించినట్లు తెలిపారు. తనిఖీల్లో సివిల్ సప్లయీస్ డీటీలు సత్యనారాయణ, నాగలక్ష్మి, వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అండర్‌పాస్ వద్ద రైతుల ధర్నా



నిరసన తెలుపుతున్న రైతులు

వైరారూరల్: ఖమ్మం – దేవరపల్లి హైవేలో భాగంగా వైరా మండలం కేజీ సిరిపురం సమీపాన అండర్‌పాస్‌ను తక్కువ ఎత్తుతో నిర్మించడంపై రైతులు నిరసన తెలిపారు. ఎత్తు తక్కువగా ఉండడంతో ధాన్యం, గడ్డి ట్రాక్టర్లు, వరి కోత మిషన్ల రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతుందని వాపోయారు. ఈమేరకు మంగళవారం పలువురు రైతులు అండర్‌పాస్ వద్ద ధర్నా చేశారు. వంతెన నిర్మాణ సమయంలోనే కాంట్రాక్టర్, మేనేజర్‌కు సమస్యను వివరించినా ఫలితం కానరాలేదని పేర్కొన్నారు. కాగా, రైతుల ధర్నా సమాచారం అందుకున్న హైవే మేనేజర్ గుత్తి శివశంకర్ చేరుకుని ఈనెల 25వ తేదీ నాటికి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో అయినాల కనకరత్నం, నారపోగు వెంకటి, ఇనపనూరి జయరావు, పింగళి లక్ష్మయ్య, పైడిపల్లి శేషగిరి, నారపోగు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి



పోటీలను ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ సీతారాములు

నేలకొండపల్లి: గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులు సత్తా చాటుతూ జాతీయ స్థాయికి ఎదగాలని నేలకొండపల్లి మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు ఆకాంక్షించారు. మండలంలోని మంగాపురంతండాలో ఇంటి ముత్యాలమ్మ తల్లి పండుగ సందర్భంగా ఏపీ–తెలంగాణలోని మూడు జిల్లాల స్థాయి క్రికెట్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పోటీలతో యువతలో పోటీతత్వం, స్నేహసంబంధాలు పెంపొందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, రాయపూడి నవీన్, హనుమంతరావు, నల్లాని మల్లికార్జున్‌రావు, ఎం.వెంకన్న, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసు కొట్టివేత

ఖమ్మంలీగల్: జిల్లాలోని చింతకానికి చెందిన సింగారపు కార్తీక్ ఆత్మహత్య ఘటనలో ఇసారం సిద్ధార్థ, వెల్లంకి సుప్రియపై నమోదైన అభియోగాన్ని కొట్టివేస్తూ ఖమ్మం మొదటి అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి వి.శివరంజని మంగళవారం తీర్పు చెప్పారు. 2021 ఆగస్టు 20న కార్తీక్ ఆత్మహత్య చేసుకోగా, అందుకు సిద్ధార్థ, సుప్రియ కారణమని ఆయన తల్లి స్వరూపరాణి ఫిర్యాదు చేసింది. దీంతోఆత్మహత్య ప్రేరేపిత కేసు నమోదు చేసినపోలీసులు కోర్టులో అభియోగపత్రం దాఖలుచేశారు. సాక్ష్యాధారాలు, ఇరుపక్షాల వాదనలను పరిశీలించాక నిందితులపై అభియోగం రుజువు కాకపోవడంతో కేసు కొట్టివేస్తూ చిన న్యాయాధికారి తీర్పు చెప్పారు. కాగా, నిందితుల తరఫున న్యాయవాది కొండపల్లి శ్రీనివాస్‌చౌదరి వాదించారు.

ఇంతింతై.. ఎదిగేలా...

- ఎస్‌హెచ్‌జీల సభ్యులకు స్త్రీ టీ స్టాళ్లు, ఇతర యూనిట్లు
- ఇందిరా మహిళా శక్తి ద్వారా రుణసౌకర్యం
- లాభాల బాట పట్టడంతో సభ్యుల్లో ఆనందం



కారేపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని స్త్రీ టీ స్టాల్



తొడితలగూడెంలోని నాటుకోళ్ల యూనిట్

కారేపల్లి: మహిళా సంఘా(ఎస్‌హెచ్‌జీ)ల్లోని సభ్యుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకాన్ని అమలుచేస్తోంది. 'మహిళల ఉన్నతి–తెలంగాణ ప్రగతి' అనే నినాదంతో మహిళలను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనేది లక్ష్యంగా చెబుతున్నారు. ఇందులో భాగంగా స్త్రీ నిధి ఏర్పాటు, బ్యాంకులతో అనుసంధానం ద్వారా గ్రామ సమాఖ్య సభ్యులకు రుణ సౌకర్యం కల్పించడమే కాక సభ్యులకు ఆసక్తి ఉన్న రంగాల్లో వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పిస్తున్నారు. ఆపై వ్యాపారాలు ఏర్పాటుచేయిస్తుండగా మహిళల శ్రద్ధతో అవి లాభాల పడుతున్నాయి. కారేపల్లి మండలంలో ఐకేపీ, సింగరేణి విజేత మండల సమాఖ్య ఆధ్వర్యాన రూ.1.35లక్షల చొప్పున రెండు స్త్రీ టీ స్టాల్ యూనిట్లు, రూ. 1.39లక్షలతో నాటు కోడిపిల్లల యూనిట్ మంజూరు చేసింది. కారేపల్లిలోని మండల పరిషత్ కార్యాలయాల ప్రాంగణంలో మొగరంపల్లి శ్రీలత, పోలీసు స్టేషన్ సర్కిల్‌లో కంచి నాగలక్ష్మి టీ స్టాళ్లు ఏర్పాటుచేయగా, తొడితలగూడెంలో బండారి రత్తమ్మకు నాటు కోడిపిల్లల పెంపకం యూనిట్ మంజూరైంది. ఇవి కాక జిల్లాలోని పలుచోట్ల ఏర్పాటైన స్త్రీ టీ స్టాళ్ల విజయవంతంగా కొనసాగుతుండడం విశేషం.

ఎస్‌హెచ్‌జీ సభ్యుల్లో ఆనందం

కారేపల్లి మండలంలో ఏర్పాటుచేసిన టీ స్టాళ్లు, నాటు కోళ్ల యూనిట్‌తో వ్యాపారం బాగుండడం, లాభాలు రావటంతో మహిళా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తొడితలగూడెంలో నాటుకోడి పిల్లల యూనిట్ ఏర్పాటుచేసిన రత్తమ్మ.. 2వేల నాటు కోడిపిల్లలతో పాటు, 20 రోజులకు సరిపడా దాణా మండల సమాఖ్య ద్వారా అందుకుంది. కోడిపిల్లలను సహజసిద్ధమైన వాతావరణంలో పెరగుతుండడంతో డిమాండ్ ఉందని. తద్వారా లాభాలు వస్తున్నాయని ఆమె ఆనందం వ్యక్తం చేసింది.

కుటుంబం బలోపేతం



స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించి ఆర్థికంగా బలోపేతమయ్యేలా రుణాలు ఇవ్వడం ఆనందంగా ఉంది. పోలీసు స్టేషన్ సర్కిల్‌లో ఏర్పాటుచేసిన స్త్రీ టీ స్టాల్‌తో వ్యాపారం బాగుంది. లాభాలు వస్తుండడంతో కుటుంబం ఆర్థికంగా బలోపేతమయ్యే అవకాశం వచ్చింది.

– కంచి నాగలక్ష్మి, కారేపల్లి

యూనిట్లు పెంచితే మేలు



కారేపల్లి మండలానికి నాటు కోళ్ల యూనిట్ ఒకటే మంజూరు చేశారు. ఇలాంటి యూనిట్లు ఇంకా మరిన్ని కేటాయిస్తే చాలా మందికి లబ్ధి జరుగుతుంది. అలాగే, రుణంలో 50శాతం సబ్సిడీ ఇవ్వడంతో పాటు ఎంచుకున్న వ్యాపారాలపై మరింతగా అవగాహన కల్పించాలి.

– బి.విజయ, వీఓ, తొడితలగూడెం

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మహిళలు, తద్వారా వారి కుటుంబాల ఆర్థికాభివృద్ధే ఇందిరా మహిళ శక్తి లక్ష్యం. ఎస్‌హెచ్‌జీల సభ్యులు అర్హులై ఉండి దరఖాస్తు చేసుకుంటే మరిన్ని యూనిట్లు అందజేయటానికి సిద్ధంగా ఉన్నాం. సభ్యులకు జిల్లా కేంద్రంలో వివిధ వ్యాపారాలపై నైపుణ్య శిక్షణ ఇప్పిస్తున్నాం.

– పిడమర్తి వెంకటేశ్వర్లు, ఐకేపీ ఏపీఎం

సర్వే సమస్యకు చెక్ పెట్టేలా..

- నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చేలా ప్రభుత్వ చర్యలు
- భూభారతి చట్టం అమలుతో పెరగనున్న అవసరాలు
- లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా గుర్తింపుతో యవతకు ఉపాధి
- ఉమ్మడి జిల్లాలో 1,073 మంది నుంచి దరఖాస్తులు



భూ సర్వే నిర్వహిస్తున్న సర్వేయర్లు(ఫైల్)

చుంచుపల్లి: భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూముల అమ్మకాలు, కొనుగోళ్లలో సర్వే మ్యాప్‌ను తప్పనిసరి చేసింది. ప్రతీ వ్యవసాయ క్షేత్రానికి హద్దులు నిర్ణయించే భూ నక్ష ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం కొత్తగా తెచ్చిన భూభారతి చట్టంలో ప్రత్యేక క్లాజ్‌ను పొందుపర్చింది. ఈ నేపథ్యంలో సర్వేయర్ల అవసరం పెరగనుండగా, శిక్షణ ఇచ్చి లైసెన్స్‌డ్ సర్వేయర్లను ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో భూ వివాదాల పరిష్కారంతో పాటు నిరుద్యోగులకు కొంత మేర ఉపాధి లభించే అవకాశం ఉంది. ఈ నెల 8 నుంచి 17 వరకు మీ సేవా కేంద్రాల దరఖాస్తులు స్వీకరించగా.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,073 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఖమ్మం జిల్లాలో 647 దరఖాస్తులు రాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 426 మంది దరఖాస్తులు వచ్చాయి. వీరందరికీ భూ సర్వేపై శిక్షణ ఇచ్చి, లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా గుర్తించనున్నారు. వీరు భూమి రిజిస్ట్రేషన్‌కు ముందు స్కెచ్ తయారు చేసి పోర్టల్లో అప్‌లోడ్ చేస్తారు. అనంతరం ప్రభుత్వ సర్వేయర్లు పూర్తిస్థాయిలో పరిశీలించాక సంబంధిత జిల్లా అధికారి ఆమోదముద్ర వేస్తారు. ఉమ్మడి జిల్లాలోని 44 మండలాల్లో ప్రస్తుతం 37 మంది సర్వేయర్లు మాత్రమే పనిచేస్తున్నారు. దీనివల్ల భూముల సర్వేకు నెలల తరబడి రైతులు కార్యాలయాల చుట్టు తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్లను ఏర్పాటు చేయనుండటంతో సర్వేల్లో జాప్యం తగ్గే అవకాశం ఉంటుంది.

50 రోజులపాటు శిక్షణ

దరఖాస్తులను పరిశీలించాక అభ్యర్థులను ఎంపిక చేసి, ఈ నెల 26 నుంచి 50 రోజులపాటు శిక్షణ

ఉమ్మడి జిల్లాలో వచ్చిన దరఖాస్తులు

కేటగిరీ	ఖమ్మం	భద్రాద్రి	మొత్తం
ఓసీ	26	05	31
బీసీ	232	69	301
ఎస్సీ	182	73	255
ఎస్టీ	207	279	486
మొత్తం	647	426	1,073

ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా నిజాం పాలనలో మాత్రమే సెత్వార్ పేరిట సర్వే నిర్వహించారు. ఆ సమయంలో రెవెన్యూ గ్రామాల వారీగా పట్టాదారుల సమాచారంతో ఖాస్రా పహాణీ తయారు చేసి అందుబాటులో ఉంచారు. రెవెన్యూశాఖ దానినే ప్రామాణికంగా పరిగణిస్తూ వస్తోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఖాస్రా పహాణీ ఆధారంగా భూ దస్త్రాల ప్రక్షాళన కార్యక్రమం చేపట్టింది. భూ హద్దులను గుర్తించేలా సర్వే చేయకపోవడంతో వివాదాలు అలాగే కొనసాగుతున్నాయి. వీటి శాశ్వత పరిష్కారానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

26 నుంచి శిక్షణ..



లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,073 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 26 నుంచి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. దాదాపు 50 రోజులపాటు మూడు దశల్లో అవగాహన కల్పిస్తాం.

– శ్రీనివాసులు, అసిస్టెంట్ డైరెక్టర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్

ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారంపై దృష్టి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, పక్కన ఎమ్మెల్యే రాగమయి

ఖమ్మం మయూరిసెంటర్: జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు 735 నమోదు కాగా, 562 కేసుల్లో తీర్పు వెలువడిందని తెలిపారు. అలాగే, కేసుల్లో బాధితులకు రూ. 11.16 కోట్లకు పైగా పరిహారం మంజూరైందని వెల్లడించారు. మిగతా కేసుల విచారణ, పరిష్కారంలో అధికారులు శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులను సమీక్షిస్తూ త్వరగా పరిష్కరించాలని తెలిపారు. అలాగే, చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, బాధితులకు పరిహారం పెంపుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈసమావేశంలో అదనపు డీసీపీ నరేష్‌కుమార్, వివిధశాఖల అధికారులు కె.సత్యనారాయణ, ఎన్. విజయలక్ష్మి, ఏ.శ్రీనివాస్, జి.నర్సింహారావు, ఎల్. రాజేందర్ గౌడ్, రెహమాన్, ఏ.రఘు, తిరుపతిరెడ్డి, కమిటీ సభ్యులు గుంతేటి వీరభద్రయ్య, జె.దాస్ మహరాజ్, తూరుగంటి అంజయ్య, కీసర రాంబాబు, అన్నం శ్రీనివాసరావు, మనికంటి వెంకట్, కలెక్టరేట్ ఉద్యోగి సీహెచ్.స్వామి పాల్గొన్నారు.

'సంపన్నులకే సంపద పంచుతున్న కేంద్రం'

ఖమ్మంమయూరిసెంటర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం దేశ సంపదను పెట్టుబడిదారులకు దోచిపెడుతోందని అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. దేశవ్యాప్త నిరసనలో భాగంగా ఖమ్మం పాత ధర్నాచౌక్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఐదు శాతంగా ఉన్న కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారుల చేతుల్లో 70 శాతం దేశసంపద ఉందని ఆరోపించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీ నెరవేర్చకుండా నిరుద్యోగ భారత్‌గామారుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎస్.నరేష్‌నాయుడు, గాదె లక్ష్మీనారాయణ, తుమ్మావిష్ణువర్ధన్, జి. రామయ్య షేక్ సుభాని, కొత్తా సీతారాములు, నున్నా నాగేశ్వరరావు, కొండపర్తి గోవిందరావు, మలీదు నాగేశ్వరరావు, ఎండీవై.పాషా, మందుల రాజేంద్రప్రసాద్, పొల్వంచ కృష్ణ, శింగు నరసింహారావు, బీ.జీ.క్లెమెంట్, తోట రామాంజనేయులు, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దాడులకు పాల్పడడం హేయమైన చర్య



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు

ఖమ్మం మామిళ్లగూడెం: ఆపరేషన్ సిందూర్ విజయవంతం సందర్భంగా సైనికుల త్యాగాలు, కేంద్రప్రభుత్వ ఘనతను కీర్తిస్తూ ఖమ్మంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తుంటే విచ్ఛిన్నం చేసేలా కొందరు దాడులకు పాల్పడటం గర్హనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ దేశ ప్రతిష్టను పెంచిన జవాన్ల వీరోచిత పోరాటాన్ని కొనియాడుతూ చేపట్టిన ర్యాలీకి మద్దతు తెలపాల్సింది పోయి మత విద్వేషాలను రెచ్చగొట్టడం బాధాకరమని తెలిపారు. ఈమేరకు జాతీయవాదులపై దాడి చేసిన వారిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని ఆయన కోరారు. ఈసమావేశంలో నాయకులు నున్నా రవికుమార్, ఈ.వీ.రమేష్, సన్నే ఉదయ్‌ప్రతాప్, అల్లిక అంజయ్య, నంబూరి రామలింగేశ్వరరావు, రవిరాథోడ్, బెనర్జీ, నల్లగట్టు ప్రవీణ్‌కుమార్, ధనియాకుల వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మద్దతుగా నిలవాలి

ఎవరు కూడా భావోద్వేగాలకు లోనుకాకుండా దేశ భద్రతకు మద్దతుగా నిలబడాలని బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో సూచించారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీలను దేశభక్తికి నిదర్శనంగా చూడాలని కోరారు. ఖమ్మంలో ర్యాలీ సందర్భంగా జరిగిన చిన్నపాటి ఘటనలను రాజకీయం చేయకుండా, బాధ్యతగా పరిశీలించి తప్పులను సరిదిద్దుకోవాలని హితవు పలికారు.

శిక్షణకు ఉపాధ్యాయుల హాజరు తప్పనిసరి

జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ



నేలకొండపల్లి : శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీఈఓ సత్యనారాయణ

నేలకొండపల్లి/ముదిగొండ: ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణకు తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యనారాయణ స్పష్టం చేశారు. నేలకొండపల్లి, ముదిగొండ మండల కేంద్రాల్లో ఏర్పాటుచేసిన శిక్షణా తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఐదు రోజుల పాటు నిర్వహించే శిక్షణకు ఉపాధ్యాయులు కచ్చితంగా రావాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మరింత మెరుగైన బోధన అందేలా జిల్లాలో 2,500 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంచేలా బోధిస్తూ, బడిబాటలో ఎక్కువ మందిని చేర్పించేందుకు కృషి చేయాలని డీఈఓ సూచించారు. ఉపాధ్యాయ వృత్తి సమాజంలో గౌరవాన్ని పెంచుతుందని తెలిపారు. కాగా, పాఠశాల ప్రారంభం రోజే నోట్ బుక్స్, టెక్స్ బుక్స్, యూనిఫాం అందించనున్నట్లు డీఈఓ వెల్లడించారు. ఈకార్యక్రమాల్లో ఎంఈఓలు బి.చలపతిరావు, రమణయ్యతో పాటు ఇటిక్యాల సురేష్, టి.వెంగళరావు, టి.గురవయ్య, కె.గోవిందరావు, మేరే వీరబాబు, కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఆపరేటర్లపై వేటు..

- కేఎంసీలో డిజిటల్ కీ దుర్వినియోగంతో చర్యలు
- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు షోకాజ్ నోటీసులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థలో కీలక విభాగమైన రెవెన్యూ విభాగంలో కంప్యూటర్ ఆపరేటర్ల అక్రమాలు ఒక్కటొక్కటిగా బయటపడుతున్నాయి. ఇటీవల అందిన ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యాన విచారణ అనంతరం ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లను అధికారులు తొలగించినట్లు తెలిసింది. ఇంటి నంబర్ల కేటాయింపులో అధికారులు తిరస్కరించిన ఫైళ్లకు ఆన్‌లైన్‌లో అనుమతులు జారీ చేయడంతో ఈ చర్య తీసుకున్నట్లు సమాచారం. రెవెన్యూ విభాగం అధికారులతో పాటు కంప్యూటర్ ఆపరేటర్లపై అనేక ఆరోపణలు ఉన్నా ఇన్నాళ్లు చర్యలు తీసుకోలేదు. ఎట్టకేలకు అధికారులు కొరడా ఝుళిపిస్తూనే, రెవెన్యూ విభాగాన్ని ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

పలు అక్రమాలు గుర్తింపు

రెవెన్యూ విభాగం అధికారులు, ఆపరేటర్లపై వస్తున్న ఆరోపణల నేపథ్యాన అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా కొన్ని రోజులుగా విచారణ చేశారు. ఇంటి నంబర్ల కేటాయింపు, వీఎల్‌టీ ట్యాక్సులు, కోర్టు కేసులో ఉన్న ఫైళ్లకు మ్యుటేషన్లు చేయడం తదితర అక్రమాలు నిజమేనని తేలడమే కాక డిజిటల్ కీ దుర్వినియోగానికి పాల్పడినట్లు గుర్తించారు. దీంతో ఆపరేటర్లు సందీప్, సునీతను సర్వీస్ తొలగించేలా అసిస్టెంట్ కమిషన్ సిఫారసు చేశారు. అనంతరం మదర్ థెరిస్సా కంప్యూటర్ ఆపరేటర్ల గ్రూప్ లీడర్లు, సభ్యులు మంగళవారం తీర్మానం చేసి సమర్పించడంతో వీరిద్దరిని తొలగించారు.

షోకాజ్ నోటీసులు

డిజిటల్ కీలు దుర్వినియోగం, విభాగంలో అక్రమాలు జరుగుతున్నా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నిర్లక్ష్యంగా ఉండడంపై కమిషనర్ సీరియస్ అయినట్లు తెలిసింది. విధుల్లో అలసత్వం ప్రదర్శించిన ఇద్దరు ఆర్ఐలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం అంతేకాక అక్రమాలపై మరింత లోతుగా విచారణ జరిపించడమే కాక డిజిటల్ కీ దుర్వినియోగానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

ఆర్ఓ రిలీవ్

ఇటీవల మహబూబాబాద్‌కు డిప్యూటేషన్‌పై బదిలీ అయిన ఆర్ఓ జి.శ్రీనివాసరావును కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య రిలీవ్ చేశారు. ఆర్ఓ డిప్యూటేషన్‌ను రద్దు చేయించి ఇక్కడే కొనసాగిస్తారని అంతా భావించారు. కానీ ఆయనను రిలీవ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇదే సమయాన మేనేజర్ బుచ్చిబాబుకు ఇన్‌చార్జి ఆర్ఓగా బాధ్యతలు కేటాయించారు.

'పది'లో అంతా ఉత్తీర్ణులయ్యేలా...



పైనంపల్లిలో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

- ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- జిల్లాలో 1,048 మందికి బోధన

నేలకొండపల్లి: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. జూన్ 3వ తేదీ నుంచి జరగనున్న సప్లిమెంటరీ పరీక్షల్లో వీరంతా ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారులు ఫెయిల్ అయిన 1,048 మంది విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా పర్యవేక్షించడంతో పాటు ఒక్క విద్యార్థి ఉన్నా కూడా సబ్జెక్టు టీచర్లతో బోధన చేయిస్తున్నారు.

ఒకరు ఉన్నా తప్పనిసరి

విద్యాశాఖ తీసుకున్న నిర్ణయంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్సెస్సీ చదివి ఫెయిల్ అయిన 1,048 మంది విద్యార్థులకు లబ్ధి జరగనుంది. నేలకొండపల్లి మండలంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 352 మంది పరీక్షలు రాయగా, 35 మంది ఫెయిల్ అయ్యారు. వీరి కోసం ఆయా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. చెన్నారం, నేలకొండపల్లి, అప్పలనరసింహాపురం పాఠశాలల్లో ఒక్కొక్కరే ఫెయిల్ అయినప్పటికీ వారి కోసం తరగతులు నిర్వహిస్తుండడం విశేషం. అయితే, కొన్ని చోట్ల మొక్కుబడిగా బోధిస్తున్నారని, అలాకాకుండా శ్రద్ధ వహించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులదే బాధ్యత...

ఏ సబ్జెక్ట్‌లో విద్యార్థి ఫెయిల్ అయ్యారో ఆ ఉపాధ్యాయులు బోధిస్తూ సప్లిమెంటరీ పరీక్షలో పాస్ అయ్యేలా తీర్చిదిద్దాలి. పాఠాలు బోధిస్తూనే ఫోన్ చేసినా సందేహాలు తీర్చాలి. జిల్లాలోని 1,048 మంది విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి.

– సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి

బస్సులో గుండెపోటుతో వృద్ధురాలు మృతి



లక్ష్మి మృతదేహం

కల్లూరురూరల్: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న వృద్ధురాలు గుండెపోటుతో మృతిచెందింది. సత్తుపల్లి నుంచి ఖమ్మం వైపు మంగళవారం వెళ్తున్న సత్తుపల్లి డిపో బస్సులో బి.లక్ష్మి(70) ప్రయాణిస్తుండగా, బస్సు తల్లాడ బస్టాండ్‌కు వచ్చేసరికి గుండెపోటుకు గురైంది. ఆమెతో పాటు ఉన్న బంధువులు అంబులెన్స్‌లో కల్లూరు ఆస్పత్రికి తీసుకురాగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమెకు భర్త, ముగ్గురు కొడుకులు, కుమార్తె ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్



DISTANCE EDUCATION
■ మావద్ద ఓపెన్ 10th, ఇంటర్, డిగ్రీ, పీజీ, MBA, B.Tech, BAMS, LLB, ITI, డిప్లొమా, ఫార్మసి BSC (Agree) డిస్టెన్స్ అడ్మిషన్లకై సం.ప్ర. సెల్: 99481 31154 [SCA 25003979]



పాస్‌పోర్ట్ పోయినది
■ నేను అనగా సభావత్ రంజిత్ నాయక్ తండ్రి: బిచ్చ నాయక్. VDO's Colony ఖమ్మం నందు నా Passport (No.J6867169) పోయింది. దొరికిన వారు సంప్రదించ గలరు. 94404 45947 [SCA 25004015]

BUSINESS SERVICES
■ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 91600 77916 స్పాట్ క్యాష్ [H-783415]
■ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును.స్పాట్ క్యాష్. 9389214214 [H-783416]





■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 20K. ఫోన్: 8977639663, 8977639662 [SCA25003891]
■ కావలెను. కేర్ టేకర్స్ (M/F), నర్సులు, ఆయాలు విజయవాడలో పేషంట్ల ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు మరియు షిఫ్టుల వారిగా చూసుకొనుటకు జీతం+వ+భో. ✆ 91608 35559, 78158 35561 [B-59]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9705444182, 9010299957
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416
సత్తుపల్లి : 9652868642
మధిర : 9949927792

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.